# సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ׀ 18 ׀ డిసెంబర్ ׀ 2024




**సోమశిలలో 72.714 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో మంగళవారం 72.714 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫైతట్టు ప్రాంతాల నుంచి 3268 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.78,680 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.7,112 |
| 3శాతం జీఎస్టీతో | రూ.7,325 |
| నవర (8గ్రా) | రూ.58,600 |

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 27.1 /22.7

జిల్లాలో బుధవారం ఒకటి రెండు చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 72 శాతంగా నమోదైంది.

## న్యూస్‌రీల్

### డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 23 వరకు జరగబోయే డిపార్ట్‌మెంట్ పరీక్షలకు సంబంధిత అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో, పరీక్షల నిర్వహణ సమన్వయకర్త ఉదయ భాస్కర్‌రావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం సమీపంలో పొట్టేపాళెంలో ఉన్న అయాన్ డిజిటల్ జోన్, కావలి పట్టణంలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో, కావలి పట్టణంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యేవారు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఫొటో ఆధారిత ధ్రువపత్రం తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు.

### 21, 22న హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్

నెల్లూరు (టౌన్): జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలోని గాంధీజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరగనున్నట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ www. breap.orf నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

### ప్రజలపై మళ్లీ భారం

- రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచుతున్న కూటమి ప్రభుత్వం
- జనవరి 1 నుంచి అమలుకు సన్నాహాలు

నెల్లూరు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక ప్రజలకు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి జనం జేబులను కొల్లగొడుతున్నారు. పంచాయతీల్లో నాలుగు శాతం మేర పన్ను పెంపుదల చేశారు. తాజాగా జనవరి ఒకటో తేదీ నుంచి భూవిలువలు పెంచనున్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నారు. పట్టణాలు, పల్లెల్లో ఇవి అమల్లోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్రాంతాలను బట్టి చార్జీలు 15 శాతం మేర పెరగొచ్చు. ఈ నెల 20న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో సవరణ వివరాలు ఉంచుతారు. 24 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 27న పరిశీలిస్తారు. అనంతరం 2025 జనవరి 1వ తేదీ నుంచి పెంచిన చార్జీలను అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### మోటార్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్



కుడి కాలువ గేటును పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

లింగసముద్రం: రాళ్లపాడు కుడి కాలువ గేటుకు మరమ్మతులు చేసేదాకా రైతాంగానికి సాగునీరు అందించాలంటే 100 హార్స్‌పవర్ ఉన్న నాలుగు మోటార్లను ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నెల్లూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు పి.శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజుల నుంచి నీటి కోసం రోడ్డెక్కిన రైతన్నలకు అండగా రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా నాయకులతో పాటు కందుకూరు నియోజకవర్గం నాయకులు కుడి కాలువ తూము గేటును పరిశీలించారు. ఈ సందర్భంగా చినపవని, సాయిపేట, పెదపవని, కొత్తపేట రైతులతో మాట్లాడారు. నీరు రాకపోవడంతో నారుమళ్లు, దున్నిన దుక్కులు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరాములు మాట్లాడుతూ గేట్లు ఎత్తడం కోసం నిపుణులైన వారిని రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా రప్పించి మరమ్మతులు చేపట్టాలని, అప్పటి వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు జీవీబీ కుమార్, ఎస్‌డీ గౌస్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దువ్వూరి జాన్, రైతు సంఘం నాయకుడు డీఎం రాయుడు పాల్గొన్నారు.

# పరీక్షల్లో ఒకరికి బదులు వేరొకరు

- నలుగురు విద్యార్థుల డిబార్
- చీటీలు పెట్టి రాస్తున్న మరో ఇద్దరు కూడా..
- ఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందినది ఎక్కువమంది ఇతర రాష్ట్రాల వారే
- ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలకు పైగా వసూలు
- నామమాత్రంగా తరగతుల నిర్వహణ
- పాస్ చేయించే బాధ్యత కళాశాలల యాజమాన్యాలదే
- చోద్యం చూస్తున్న వర్సిటీ అధికారులు

**బీపీఈడీ, ఎంపీఈడీ ఎగ్జామ్స్‌లో ఇదీ తీరు**

కఠినంగా జరగాల్సిన పబ్లిక్ పరీక్షలు అపహాస్యం పాలవుతున్నాయి. కళాశాలల యాజమాన్యాలు, వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు కుమ్మక్కు కావడంతో మొక్కుబడిగా జరుగుతున్నాయి. జిల్లాలో బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. ఒకరికి బదులు మరొకరు హాజరై పరీక్షలు రాస్తున్నారంటేనే ఏ రీతిలో పరీక్షలు జరుగుతున్నాయో ఇట్టే అర్థమవుతోంది. మరికొందరు ప్రతిరోజు ఇన్విజిలేటర్ల సాక్షిగా చీటీలు పెట్టి రాస్తు సవాల్ విసురుతున్నారు.





నెల్లూరు (టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ నిర్వహించే బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై ఫిర్యాదుతో వర్సిటీ అధికారులు జరిపిన తనిఖీల్లో ఈ విషయాలు బట్టబయలయ్యాయి. దీంతో రెండు రోజుల్లో ఆరుగురు విద్యార్థులను డిబార్ చేశారు. వాస్తవానికి ఏం జరుగుతున్నదంటే.. విద్యార్థులు పరీక్షలకు హాజరు కాకపోయినా పాస్ చేయించే బాధ్యతను ఆయా కళాశాలల యాజమాన్యాలు తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఒప్పందానికి ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారన్న ప్రచారం ఉంది. బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలకు హాజరయ్యే వారిలో 80 శాతం మంది తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన వారే కావడం గమనార్హం. అయితే కళాశాలల నిర్వహణను పర్యవేక్షించాల్సిన వర్సిటీ అధికారులు కుర్చీలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పరీక్షలకు 200 మందికి పైగా హాజరు**

జిల్లాలో రెండు కళాశాలల యాజమాన్యాలు బీపీఈడీ, ఎంపీఈడీ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయి. ఒక్కో కోర్సుకు 100 మంది విద్యార్థులు చేరేందుకు అనుమతి ఉన్నట్లు తెలిసింది. కోర్సు వ్యవధి రెండేళ్ల పాటు ఉంటుంది. ఈనెల 13వ తేదీ నుంచి ఈ పరీక్షలు జరుగుతున్నాయి. బీపీఈడీకి 62 మంది, ఎంపీఈడీకి 116 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ పరీక్షలకు నెల్లూరులోని వీఆర్ న్యాయ కళాశాలను సెంటర్‌గా కేటాయించారు. ఈ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందన్న ఫిర్యాదుతో తొలిరోజు వర్సిటీ నుంచి వచ్చిన అబ్జర్వర్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక విద్యార్థికి బదులు మరొకరు పరీక్ష రాస్తున్న విషయాన్ని గుర్తించారు. లోతుగా తనిఖీలు చేయగా నలుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు తప్పించుకుని పారిపోయినట్లు వర్సిటీ అబ్జర్వర్ చెబుతున్నారు. వీరిని డిబార్ చేశారు. ఆ తరువాత 16వ తేదీన తనిఖీ చేయగా చీటీలతో పరీక్ష రాస్తున్న ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. వీరిద్దరినీ కూడా డిబార్ చేశారు. ఈ రీతిలో బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు జరుగుతుండటంపై పలువురు మండిపడుతున్నారు.





పరీక్షలు జరుగుతున్న నెల్లూరులోని వీఆర్ న్యాయ కళాశాల

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లు చేసుకుంటున్న కళాశాలలపై విచారణ చేపట్టి అవకతవకలకు పాల్పడితే చర్యలు చేపడతాం. విచారణ కోసం రెండు రోజుల్లో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం. ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాస్తున్న నలుగురు విద్యార్థులను డిబార్ చేశాం. మరో రెండేళ్ల పాటు పరీక్షలు రాయకుండా చర్యలు చేపట్టాం. చీటీలు పెట్టి రాస్తున్న మరో ఇద్దరిని డిబార్ చేశాం. వీరిపై కేసులు పెడతాం. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటాం. అబ్జర్వర్‌తో పాటు స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం.

– విజయభాస్కరరావు, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్, వీఎస్‌యూ

**పొరుగు రాష్ట్రాల విద్యార్థులే అధికం**

జిల్లాలో వెంకటాచలం, వింజమూరు ప్రాంతాల్లోని కళాశాలల్లో బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులు నిర్వహిస్తున్నారు. తమిళనాడు, ఒడిశా, కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఈ కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్నట్లు తెలిసింది. పొరుగు రాష్ట్రాల్లో పీఈటీ, పీడీలకు డిమాండ్ ఉంది. అయితే అక్కడ కళాశాలల్లో పరీక్షలు కఠినంగా నిర్వహిస్తారన్న ప్రచారం ఉంది. దీంతో నెల్లూరు జిల్లాలో కళాశాలకు వెళ్లకుండానే పాస్ కావచ్చన్న సమాచారంతో పొరుగు రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది నెల్లూరు జిల్లాకు వస్తున్నారు. కళాశాలల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 లక్షలకు పైగా తీసుకుని ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలిసింది. తనిఖీల్లో మాస్ కాపీయింగ్ చేస్తూ పట్టు బడటంతో వీరంతా యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని యూనివర్సిటీ వీసీ విజయభాస్కరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరీక్ష కేంద్రం వద్దకు వచ్చి పరిశీలించారు.

**పొలానికి తీసుకెళ్లి ఉంటే**

# బిడ్డ బతికేవాడయ్యా!

ముచ్చటైన చిన్నారి తమ కళ్ల ముందే నిర్జీవంగా మారిపోతే.. కన్నవారి కలలన్నీ కల్లలైపోతే.. ఆ తల్లిదండ్రుల శోకం ఊహకందనిది. అది ఎవ్వరూ తీర్చలేనిది. – కందుకూరు

- కన్నీరుమున్నీరైన తండ్రి
- స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి
- అనంతసాగరం గ్రామంలో విషాదం



స్కూల్ బస్సు రూపంలో మృత్యువు ఓ బాలుడిని బలితీసుకుంది. అనంతసాగరంలో మంగళవారం జరిగిన ఈ ఘటనతో బాలుడు (మోక్ష) మృతదేహాన్ని చూసి తండ్రి శ్రీకాంత్ భోరున విలపించడం చూపరులను కంటతడి పెట్టించింది. కందుకూరు మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన గోగినేని శ్రీకాంత్, నాగమణి దంపతుల కుమారుడు మోక్ష (2). వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భార్గవ్‌ను స్కూల్‌కు తీసుకెళ్లేందుకు వచ్చిన స్కూల్ బస్సు ఢీకొట్టడంతో చిన్నకుమారుడు (మోక్ష) నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ప్రమాదానికి ఓ అరగంట ముందు జరిగిన సంఘటన తలచుకుని తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు. శ్రీకాంత్ గ్రామంలోనే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తోటకు వెళ్తుండగా చిన్నారి మోక్ష తండ్రి వెంట పడుతూ మారాం చేశాడు. బండి ఎక్కించుకుని తీసుకెళ్లాలంటూ తండ్రిని పట్టుకుని చాలాసేపు బతిమాలాడు. అయితే పొలానికి వెళ్తుండడంతో మోక్షను బలవంతంగా వదిలించుకుని ఇంట్లో వదిలిపెట్టి పొలానికి వెళ్లాడు. అదే నా బిడ్డ నాకు కాకుండా పోవడానికి కారణమైందంటూ హాస్పిటల్‌లో కుప్పకూలిపోయాడు. రామ, లక్ష్మణుల్లాంటి ఇద్దరు పిల్లలున్నారని అందరూ అంటుంటే సంతోషంతో పొంగిపోయేవాడినని, కానీ ఆ దేవుడు ఒకర్ని తీసుకుపోయి అన్యాయం చేశాడంటూ విలపించాడు.

**స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంపై ఆగ్రహం**

అభంశుభం తెలియని పిల్లలను స్కూల్‌కు తీసుకొచ్చే క్రమంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాల్సిన యాజమాన్యం ప్రదర్శించిన నిర్లక్ష్యం ఈ సంఘటనలో స్పష్టంగా కనిపించింది. ప్రతి స్కూల్ బస్సులో నిపుణుడైన డ్రైవర్‌తో పాటు, క్లీనర్ కచ్చితంగా ఉండాలి. పిల్లలను ఎక్కించుకుని దించే క్రమంలో పూర్తిగా క్లీనర్ బాధ్యత తీసుకోవాల్సి ఉంది. అయితే మంగళవారం చిన్నారి మోక్ష మృతికి కారణమైన స్కూల్ బస్సులో క్లీనర్ లేదు. దీంతో డ్రైవరే పిల్లలను ఎక్కించుకుని తీసుకుని వస్తున్నాడు. మంగళవారం అనంతసాగరంలో జరిగిన సంఘటనలో కూడా తల్లి నాగమణి తన పెద్దకుమారుడు భార్గవ్‌ను స్కూల్ బస్సు ఎక్కించేందుకే వచ్చింది. ఈ సమయంలో డ్రైవర్ ధ్యాస అంతా భార్గవ్ స్కూల్ బస్సు ఎక్కడా లేదా అనే దానిపై ఉంది. ఈ క్రమంలో బస్సు ముందు ఎవరున్నారన్న.. విషయాన్ని కూడా చూసుకోకుండా డ్రైవర్ బస్సును ముందుకు కదిలించినట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ విషయంలో స్కూల్ యాజమాన్యం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఏరియా వైద్యశాలలో విలపిస్తున్న తండ్రి శ్రీకాంత్ (ఎరుపు గళ్ల చొక్కా ధరించిన వ్యక్తి)

# జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

- ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్
- నుడా చైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ద్వారా జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ సూచించారు. మంగళవారం నెల్లూరులోని నుడా కార్యాలయ ప్రాంగణంలో చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. తొలుత నర్తకి సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిచే ప్రమాణ స్వీకారం చేయించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైనదిగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, పనబాక లక్ష్మి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్‌కు అవమానం**

నుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన నేతలు దివంగత ఎన్టీఆర్‌ను విస్మరించారు. నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి కనీసం ఒక పూలమాల వేసి నివాళులు కూడా అర్పించలేదు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, చిత్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

**భూ ఆక్రమణలు జరగకుండా చట్టం**


నెల్లూరు రూరల్: భూ ఆక్రమణలు జరగకుండా ప్రభుత్వం చట్టం తీసుకువస్తుందని, దీనికి సంబంధించి నియమ నిబంధనలు రూపొందిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాలులో జిల్లా మంత్రులు రామనారాయణరెడ్డి, నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి ఆయన రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయం, డ్వామా, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ రెవెన్యూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం సదస్సులను అన్ని గ్రామాల్లో నిర్వహిస్తుందన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో నీటిని నేటి నుంచి అందించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు పాటించండి

- పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్ కుమార్

నెల్లూరు (పొగతోట): జిల్లాలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ ఎస్‌ఈ అశోక్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సీసీ రోడ్ల నిర్మాణంపై ఏఈలు, డీఈలు, మండల ఇంజినీరింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. నిర్మాణాల్లో లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు నిర్మాణాలు జరిగే సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏఈలు, డీఈలు, అధికారులు పాల్గొన్నారు.

# నిద్రావస్థలో అధికారులు



రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఖనిజం

- రవాణాకు సిద్ధంగా ఖనిజ సంపద
- కూతవేటు దూరంలోనే యథేచ్ఛగా పనులు

సైదాపురం: మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులంతా నిద్రావస్థలోనే ఉన్నారనేందుకు ఈ సంఘటనే నిదర్శనం. మండల కేంద్రమైన సైదాపురంలోని నడిబొడ్డులో ఆసుపత్రి వెనుక ప్రాంతంలో అపారమైన ఖనిజ సంపదను నిల్వ ఉంచారు. లక్షలాది రూపాయల విలువైన ఖనిజ సంపద రవాణా చేసేందుకు బ్యాగుల్లో కట్టి రవాణా చేసేందుకు అక్రమార్కులు సిద్ధంగా ఉన్నారు. అక్కడే ఖనిజాన్ని గ్రేడింగ్ పనులు కూడా చేస్తుండటం గమనార్హం. ఎలాంటి అనుమతి లేని చోట అపారమైన ఖనిజం ఉండటంతో పాటు అక్కడే పనులను చేస్తున్న తీరు చూస్తుంటే అధికారులు ఉన్నారా... లేరా అనే అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా నిద్రావస్థలో ఉన్న మైనింగ్ అధికారులు కళ్లు తెరిచి అక్రమ రవాణాతో పాటు పనులను కూడా నిలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.



పనులు చేస్తున్న కూలీలు

# అభివృద్ధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం





కలిగిరిలో చెక్‌డ్యామ్‌ను, నిమ్మతోటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కలిగిరి: కలిగిరి, వెలగపాడు, నాగసముద్రం గ్రామాలలో జలశక్తి అభయాన్ కేంద్ర బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఐఆర్‌ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యేంద్రకుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు లోకేశ్, డి.లక్ష్మీనారాయణ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా భూగర్భ జలాల అభివృద్ధి చేయడానికి చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. మినీ గోకులాలు, హార్టీకల్చర్, చెక్‌డ్యాములు, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ యూనిట్లను సందర్శించారు. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. పంటల సాగు, దిగుబడులు, మార్కెటింగ్ చేసే విధానాలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ జలాలు అభివృద్ధి చెందడానికి ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక అధికారులకు సూచించారు. భూగర్భ జలాల పెంపుపై పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ గాయత్రీదేవి, శంకరనారాయణ, ఏపీఓ శ్రీనివాసులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సముద్ర తీర ప్రాంత ప్రజలతో పాటు పెన్నానది పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, బోట్లు, వలలు జాగ్రత్త చేసుకునేలా చూడాలని ఆదేశించారు. పెన్నానదీ పరీవాహక గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లవద్దని సూచించారు. అధికార యంత్రాంగమంతా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 0861-2331261 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

## క్లుప్తంగా

### ఎల్‌టీ, ఫార్మసిస్టుల మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా ఖాళీగా ఉన్న ల్యాబ్‌టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల పోస్టులకు ఇటీవల కాంట్రాక్ట్ విధానంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తుదారులు తమ అభ్యర్థనలను బుధ, గురువారాల్లో సాయంత్రం 5 గంటల్లోపు లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో సమర్పించాలని కోరారు.

### షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై విచారణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుననుసరించి ఏపీ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీరాజీవ్ రంజన్‌మిశ్రా ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్‌ను నియమించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ కార్యాలయాన్ని విజయవాడలోని మొఘల్రాజపురంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏమైనా రాతపూర్వక వినతి పత్రాలు ఇవ్వదలిస్తే వారు జనవరి నెల 9వ తేదీలోపు కార్యాలయం పనివేళల్లో అందజేయాలని కోరారు. వ్యక్తిగతంగా ఇవ్వలేకపోతే తిరుగు రసీదుతో కూడిన రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా omcsccsub clasification@gmail. com ద్వారా గడువులోపల వినతి పత్రాలు పంపవచ్చని తెలిపారు.

### ఎస్ఈఐఎల్ ఎనర్జీకి 'బెస్ట్ సోషల్ వెల్ఫేర్ ఇనిషియేటివ్' అవార్డు




అవార్డును అందుకొంటున్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్) ప్రతినిధులు

తోటపల్లిగూడూరు: భారతదేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన స్థానికంగా ఉండే ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్)కు ప్రతిష్టాత్మకమైన యూబీఎస్ ఫోరమ్ 'బెస్ట్ సోషల్ వెల్ఫేర్ ఇనిషియేటివ్' అవార్డు లభించింది. మంగళవారం బెంగళూరులో జరిగిన 12వ ఎడిషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సమ్మిట్ అవార్డ్స్ కార్యక్రమంలో కంపెనీకి ఈ అవార్డ్ ప్రదానం చేసినట్లు సీఈఓ రాఘవ్ త్రివేది తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు దూరంగా ఉన్న వర్గాల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో 8 గ్రామ పంచాయతీల్లో 5 వేల కుటుంబాలపై సానుకూల ప్రభావాన్ని చూపాయన్నారు.

### బెల్టు దుకాణాలపై దాడులు

- 24 మద్యం బాటిళ్లు స్వాధీనం

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరంలో బెల్టు దుకాణాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్ద మద్యం విక్రయిస్తున్న ఎర్రకట్ట సంఘంకు చెందిన ఎ. వెంకయ్యను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 9 క్వార్టర్లు, ఇరుగాళ్లమ్మ సంఘం సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద అదే ప్రాంతానికి చెందిన రామకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ బెల్టు దుకాణాలపై పక్కా సమాచారంతో దాడులు చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే 0861- 2331159 కు లేదా స్థానిక ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ దాడుల్లో ఈఎస్‌టీఎఫ్ స్క్వాడ్, నెల్లూరు-1 ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

- జెడ్పీ సీఈఓ విద్యారమ




చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యారమ

తోటపల్లిగూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ తెలిపారు. మండలంలోని చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపుదిద్దుతున్నామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోరిక మేరకు పాఠశాల ప్రాంగణంలో ఉన్న శిథిలావస్థ భవనాలను తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ జయరామనాయుడు, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, సమగ్రశిక్ష అభియాన్ పీఓ ఉషారాణి పాల్గొన్నారు.

## నెల్లూరుకే ఐకాన్ 'సంతానం' పుస్తక ప్రపంచం

- కేజీ నుంచి పీజీ, సుప్రసిద్ధ రచయితల పుస్తకాల వరకు అందుబాటు
- ఎనిమిది దశాబ్దాల కాలంలో ఏడు బ్రాంచ్‌లుగా విస్తరించిన బాండాగారం
- సెకండ్ హ్యాండ్ బుక్స్‌తో ఎంతో మందిని విద్యావేత్తలుగా మార్చింది

# పుస్తకంలో ఒక పేజీ..




'సంతానం'.. నెల్లూరు పుస్తక ప్రపంచం. సింహపురి చరిత్ర పుటల్లో ఒక పేజీని నింపుకుందంటే అతిశయోక్తి కాదు. కొన్ని దశాబ్దాల క్రితం పుస్తకాలు కొనే స్థోమత అందరికీ ఉండేది కాదు. సెకండ్ హ్యాండ్ పుస్తకాలతో ఎంతో మంది నిరుపేద విద్యార్థులు, నిరుద్యోగుల కలలు సాకారానికి ఇతోదికంగా సాయపడింది. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా నెల్లూరుకే ఐకానిక్‌గా నిలుస్తోంది. స్టడీ మెటీరియల్స్ నుంచి కేరీర్ గైడెన్స్ వరకు.. ఆధ్యాత్మికం నుంచి జ్యోతిష్యం వరకు.. నవలల నుంచి నవ్వుల ప్రపంచం వరకు విభిన్న పుస్తకాలకు కేరాఫ్‌గా ఉంది.

నెల్లూరు సిటీ: పాత పుస్తకాలతో ప్రసిద్ధిగాంచిన 'సంతానం' బుక్‌స్టాల్ నుంచి.. బుక్‌స్టాల్స్‌గా దిన దిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది. ఇప్పుడు కొత్త, పాత పుస్తకాలతో విస్తరించింది. విద్యార్థి నుంచి ఐఏఎస్, ఐపీఎస్ వరకు, శాస్త్ర పండితుల నుంచి శాస్త్రవేత్తల వరకు విజ్ఞాన, విద్యావేత్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాల నిలయంగా నిలుస్తోంది. నెల్లూరు నగరానికి చెందిన కడాంబి చల్లా స్వామి అయ్యంగార్ 1944లో ట్రంకురోడ్డులో 'సంతానం' బుక్‌స్టాల్‌ను ప్రారంభించారు. అయ్యంగార్‌కు పది మంది సంతానం. వీరిలో ముగ్గురు కుమార్తెలు, ఏడుగురు కుమారులు. ఏడుగురు కుమారులు ఉన్నత చదువులు అభ్యసించినా 'సంతానం' బుక్‌స్టాల్స్‌ను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దశాబ్దాల నుంచి వందల కుటుంబాలకు జీవనోపాధిగా సంతానం బుక్‌స్టాల్ నిలిచింది.

**పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆశాజ్యోతి**

అప్పట్లో పేద, మధ్య తరగతి విద్యార్థులు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఆర్థిక పరిస్థితి సరిపోయేది కాదు. ఈ క్రమంలో చదువును పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి సంతానం బుక్ స్టాల్ నిర్వాహకులు పాత పుస్తకాలు కొనుగోలు చేసి విక్రయాలు చేస్తుండేవారు. దీంతో పేద విద్యార్థులు తమకు కావాల్సిన పుస్తకాలను తక్కువ ధరకే కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించారు.




సంతానం బుక్‌స్టాల్



పాత, కొత్త పుస్తకాల స్టోర్

**ఇతర జిల్లాల నుంచి కూడా..**

నగరంలోని సంతానం బుక్‌స్టాల్‌కు ఇతర జిల్లాల నుంచి కూడా పుస్తకాలు కొనుగోలుకు వచ్చేవారు. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్స్, వివిధ ప్రవేశ పరీక్షలు, ఆధ్యాత్మికం, వైద్యం, లాకోర్సు, పూజ, జ్యోతిష్యం ఇలా అన్ని రంగాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక పుస్తకాలు దొరుకుతున్నా.. సంతానంపై ఏ మాత్రం ప్రభావం చూపకపోవడం గమనార్హం.

**ప్రసిద్ధ రచయితలు వచ్చి..**

ఈ బుక్ స్టాల్స్‌లో ప్రసిద్ధ రచయితలు ఆరుద్ర, ఆత్రేయ, వేటూరి సైతం 'సంతానం'కు వచ్చి తమకు ఇష్టమైన, అరుదైన పుస్తకాలు కొనుగోలు చేసిన దాఖలాలు ఉన్నాయి. జిల్లాలోని ప్రముఖ రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, వివిధ రంగాల్లోని ప్రముఖులు సంతానంకు వచ్చేవారు.



అన్ని రకాల పుస్తకాలు

**రూ.కోట్లు సంపాదించినా ఈ సంతోషం రాదు**



మా తండ్రి స్వామి అయ్యంగార్ 1944లో సంతానం బుక్ స్టాల్ స్థాపించారు. ఆయన తర్వాత ఏడుగురు కుమారులం కొనసాగించాము. పెద్ద కుమారుడిగా నేను చిన్నప్పటి నుంచే నా తండ్రి వద్దనే ఉంటూ వ్యాపారంలో సహాయ పడేవాడిని. అప్పటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులకు ఎంఆర్‌పీ కంటే తక్కువ ధరకు అందించాము. ఇప్పటికీ అనేక ప్రాంతాల నుంచి పుస్తకాలు కొనుగోళ్లు చేసేందుకు వస్తున్నారు.

– కడాంబి విజయరాఘవ చారి, ఎంకామ్, సంతానం బుక్‌స్టాల్ నిర్వాహకుడు

**సంతానంతో ప్రతి ఒక్కరికీ అనుబంధం**



నా చిన్న వయస్సులో కొన్ని పుస్తకాలను కొనుగోలు చేశాను. ఇప్పుడు ఉన్నత స్థాయిలో ఉండే అనేక మంది సంతానంలో పుస్తకాలు కొనుగోళ్లు చేయడం చూశాను. నెల్లూరులోని అనేక మందికి 'సంతానం'తో అనుబంధం ఉంది. ఎంతో మంది ఇక్కడ పుస్తకాలు కొనుగోలు చేసి చదువుకున్న వారు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఉన్నారు.

– బాలకృష్ణ, టీపీఆర్‌ఓ, నెల్లూరు మున్సిపల్ ఉద్యోగి

**ఇక్కడ దొరకని పుస్తకం లేదు..**



నాకు ఓ పుస్తకం కావాల్సి వచ్చింది. బుక్ స్టాల్స్‌లోఎక్కడా ఆ పుస్తకం దొరకలేదు. దీంతో మా మామయ్య సంతానం బుక్‌స్టాల్‌కు వెళ్లమని సలహా ఇచ్చారు. ఎక్కడా దొరకనిది అక్కడ ఏమి దొరుకుతుందని ప్రశ్నించాను. ఒకసారి వెళ్లి అడుగు అని అన్నారు. దీంతో వెళ్లి ఆ పుస్తకం ఉందా అని అడిగితే రెండు నిమిషాల్లో వెతికి ఆ పుస్తకాన్ని ఇచ్చారు. నేను షాక్‌కు గురయ్యాను.

– షేక్ మిజ్బా సుల్తానా, ఎంబీబీఎస్, పీహెచ్‌సీ వైద్యురాలు

## ట్రాఫిక్ నిలిపివేసి తమ్ముళ్ల వీరానందం



బ్యారికేడ్‌లు పెట్టి దారి మళ్లించి..




రోడ్డు బ్లాక్ చేసి..

- ఆంక్షలు విధించి పోలీసుల అత్యుత్సాహం

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరంలో టీడీపీ నేతల ప్రచార్భాటం.. ప్రజాజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నిలిపివేసి ద్విచక్ర వాహనాల రణగొణ ధ్వనులతో వీరానందం పొందారు. వీరి వీరవిహారానికి పోలీసులు అడుగులకు మడుగులు ఒత్తారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను దారి మళ్లించి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఆఖరికి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులను సైతం దారి మళ్లించడానికి కరకుదనం ప్రదర్శించారు. పోలీసు అధికారులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నారు. వారి పర్యటనలు, ప్రచారాల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నేతలను ప్రసన్నం చేసుకునేందుకు చిన్నపాటి కార్యక్రమాలకు సైతం పెద్ద హడావుడి చేస్తున్నారు. ప్రజలు ఎటుపోతే మాకేంటన్న తీరుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా మంగళవారం నుడా చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నర్తకీ సెంటర్ నుంచి నుడా కార్యాలయం వరకు అధికార పార్టీ నేతల ర్యాలీ సాగడంతో రహదారి వెంబడి ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని నరకయాతన అనుభవించారు. ఆటోనగర్ నుంచి నుడా కార్యాలయం వెళ్లే రహదారిలోని దుకాణాలన్నింటిని మూసివేయించడంతో వ్యాపారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో భద్రత దృష్ట్యా వాహనాల రాకపోకలను నిషేధించడంతో పాటు దుకాణాలను మూసివేయించే వారు. అయితే నుడా చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆ స్థాయిలో పోలీసు అధికారులు ఇలాంటి చర్యలు తీసుకోవడం చూస్తే అధికార పార్టీ నేతలకు ఏ స్థాయిలో సాగిల పడుతున్నారో ఇట్టే అర్థమవుతోందని నగర వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



దుకాణాలు మూసివేసి..



భారీ భద్రతా ఏర్పాట్లు

## 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏకగ్రీవం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో సాగునీటి సంఘ ఎన్నికల్లో రెండో ప్రక్రియ డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక మంగళవారం ముగిసింది. జిల్లాలోని పెన్నార్ డెల్టా, సోమశిల ప్రాజెక్టుల పరిధిలోని 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం అయింది. జిల్లాలో సాగునీటి సంఘ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 14న సాగునీటి సంఘాలకు. ప్రాదేశిక నియోజకవర్గాలకు (టీసీ) ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. జిల్లాలోని 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీల నియామకం జరిగింది.

**ప్రాజెక్ట్ కమిటీల ఎన్నిక ఎప్పుడో..**

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా తాగునీటి సంఘాలకు, ప్రాదేశిక నియోజకవర్గాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ కమిటీల ఎన్నిక విషయం పక్కన పెట్టింది. ఎన్నికలకు సంబంధించి విడుదల చేసిన షెడ్యూల్లో సాగునీటి సంఘాలకు, ప్రాదేశిక నియోజకవర్గాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. ఇక ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## బెల్టులపై కేసులతో సరి

- సరఫరాదారులపై చర్యలేవి?

నెల్లూరు (క్రైమ్): బెల్టు షాపుల నిరోధిస్తున్నామంటూ విక్రయాలపై కేసులు నమోదు చేసి నిందితుల అరెస్ట్‌తో ఎక్సైజ్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అసలు ఆ బెల్టు షాపునకు మద్యం ఎక్కడ నుంచి వచ్చింది? ఎవరు సరఫరా చేశారు అనే మూలాల్లోకి వెళ్లకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎక్సైజ్ అధికారుల నామమాత్రపు చర్యలతో జిల్లాలో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో అధికారికంగా 182 మద్యం దుకాణాలు ఉండగా అనధికారికంగా వేలల్లో బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. వాటిలో 24 గంటలూ జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా పెంచి విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. బెల్టు షాపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని కఠినంగా వ్యవహరిస్తామని, బెల్టు షాపునకు మద్యం సరఫరా చేసే దుకాణంపై సైతం చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరికలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిస్తున్నాయి. జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. బెల్టు నిర్వాహకులను అరెస్ట్ చేయడంతో తమపనై పోయిందని చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు సుమారు 200 పైచిలుకు బెల్టు షాపులపై అధికారులు కేసులు నమోదు చేశారు. అయితే వాటికి మద్యం ఎక్కడ నుంచి వచ్చింది? సరఫరా దారులు ఎవరు? తదితరాలపై ఎక్సైజ్ అధికారులు కనీస దృష్టి సారించిన దాఖలాలు లేవని తెలుస్తోంది. అనేక దుకాణాల నుంచే బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా అవుతున్నట్లు సమాచారం. అయితే ఇంత వరకూ ఒక్క దుకాణంపైనా కేసు నమోదు కాకపోవడం గమనార్హం. దీని వెనుక వ్యాపారులతో కుదుర్చుకున్న ముందస్తు ఒప్పందాలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపుల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. ఎక్సైజ్ అధికారులను వివరణ కోరగా బెల్టు దుకాణాల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లపై లేబుల్స్ లేకపోవడంతో అవి ఏ దుకాణంకు చెందినవో తెలియడం కష్టమని చెబుతున్నారు. బెల్టు షాపులపై దాడులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

### 21న దిశ సమావేశం

నెల్లూరు (పొగతోట): జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (డీడీసీఎంసీ /దిశ) సమావేశం ఈ నెల 21న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 43 అంశాలకు సంబంధించి చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.


### డిగ్రీ పరీక్షలకు 390 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 390 మంది గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 4,820 మందికి గాను 4430 మంది హాజరయ్యారని తెలిపారు.

### నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ.25 |
| సన్నవి | : రూ.18 |
| పండ్లు | : రూ. 10 |



## కోళ్ల వ్యర్థాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని కాగులపాడు ప్రాంతంలో సాగులో ఉన్న చేపలకు ఆహారంగా తరలిస్తున్న చికెన్ వేస్ట్ వాహనాన్ని బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కాగులపాడులోని హైస్కూల్ వెనుక గుంటల్లో చేపల సాగు చేపడుతున్నారు. వీటికి ఆహారంగా కుళ్లిన కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తుండడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఎన్నిసార్లు చెప్పినా.. నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మంగళవారం కోళ్ల వ్యర్థాలను ఐషర్ వాహనంలో తీసుకువచ్చారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు చికెన్ వేస్ట్ తరలిస్తున్న వాహనంతోపాటు మరో టాటా 207 వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ సంతోష్ రెడ్డి తెలిపారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి